క్లుప్తంగా

ఉగాది కవి సమ్మేళనం



తెనాలి: పట్టణానికి చెందిన శారదా సాహితీ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటైన సభకు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షత వహించారు. సమితి కార్యదర్శి డాక్టర్ సామల లక్ష్మణబాబు ఉగాది సందేశం వినిపించారు. కవి సమ్మేళనంలో పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ జ్యోతిస్వరూపరాణి, ఈఎల్వీ అప్పారావు, ఆళ్ల నాగేశ్వరరావు, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, పాతూరి సుబ్రహ్మణ్యం, మొవ్వా సుబ్బారావు, మునిపల్లి రఘునాధరావు తమ కవితలను వినిపించారు. అనంతరం కవులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. గ్రంథాలయ పాలకురాలు రమాదేవి శుభాకాంక్షలు తెలిపారు. పాత్తూరు నాగేంద్రం వందన సమర్పణ చేశారు.

ఎన్టీఆర్ సినిమాలపై చర్చావేదిక



తెనాలి: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ నటించిన సినిమాలు, వ్యక్తిత్వం, రాజకీయ జీవితంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కంచర్ల కాశయ్య, మల్లవరపు విజయ్ ప్రసంగించారు. వీరితోపాటు స్థానిక కళాకారుడు, అమ్మ డ్యాన్స్ అకాడమీ ఈశ్వర్‌ను సత్కరించారు. దేవరపల్లి భవాని, చెరుకుమల్లి సింగారావు ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, కొండముది రమేష్, వెనిగళ్ల శివప్రసాద్, ఉమ్మలనేని ధర్మారావు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యంకు నివాళి



తెనాలి: తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారిణి మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఎం తెనాలి శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పట్టణ చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె సేవలను స్మరించుకున్నారు. పార్టీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్, సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, ఎం.శివకుమారి పాల్గొన్నారు.

పంటల పరిశీలన



తెనాలి: అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. ఆదివారం రైతుసంఘం బృందం పట్టణ అయితానగర్, సమీప నేలపాడు గ్రామంలో జొన్న, మొక్కజొన్న పైర్లను పరిశీలించింది గతంలో మాండూస్ తుఫాన్ వల్ల భూములు తడి ఆరకపోవటంతో తర్వాత వేసిన జొన్న, మొక్కజొన్న పైర్లు ఆశించినంతగా ఎదగలేదని మేకల చిట్టిబాబు చెప్పారు. ముసురు వాతావరణంతో పైర్లను పురుగు ఆశించినట్టు పాటిబండ్ల వీరయ్య తెలిపారు. పండిన పంట అయినా సక్రమంగా ఇంటికి చేరుతుందా అని రైతులు మదనపడుతున్నారని చెప్పారు. రైతులపై ప్రకృతి పగబట్టినట్టు ఉందని ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలని కోరారు.

విద్యార్థులు బాగా చదవాలి



బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆశ్రమ నిర్వాహకులు స్వామి స్థైర్యానంద సరస్వతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని విజయలక్ష్మీపురంలో స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఉచిత బాలుర హాస్టల్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో స్వామి స్థైర్యానంద సరస్వతి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో చదువుకుని సంస్కృతిసంప్రదాయాలను కాపాడాలని చెప్పారు. వేటపాలెం రాఘవేంద్ర స్వామీజీ మాట్లాడుతూ బాలల నుంచే విలువలతో కూడిన విద్య వస్తోందని సూచించారు. విన్నకోట సత్యప్రసాద్, మామిడి రాజశేఖర్, వార్డెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆపన్నులపై దయ

- ఇంటి, ఖాళీస్థల పన్నులపై వడ్డీ మాఫీ
- ప్రజలపై భారం తగ్గించిన ప్రభుత్వం
- తెనాలిలో సుమారు 7వేల మందికి రూ.8కోట్ల మేర లబ్ధి



తెనాలి మున్సిపల్ కార్యాలయం

తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థల యజమానులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఏళ్లుగా ఇంటి, ఖాళీ స్థల పన్నులను బకాయిపడి అవి వడ్డీలతో కలిపి రెండింతలు కావడంతో చెల్లించే ఆర్థిక స్థోమత లేక సతమతమవుతున్న ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఈనెల 31లోపు పన్నులు చెల్లించే వారికి వడ్డీని రద్దు చేస్తూ గత గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల తెనాలి మున్సిపాలిటీ పరిధిలోని సుమారు ఏడు వేల మందికి రూ.8కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. తెనాలి పురపాలక సంఘ పరిధిలో సుమారు 35వేలకుపైగా నివాస గృహాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మంది సకాలంలో పన్నులు చెల్లిస్తుంటారు. వీటి వల్ల సుమారు ఏడాదికి 15.70 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఇవి కాకుండా తెనాలి పట్టణంలో 2,595 ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి యజమానులు వివిధ కారణాల రీత్యా(బ్యాంక్ రుణాల కోసం) పన్నులు వేయించుకుని మొదటి అర్ధ సంవత్సరం చెల్లిస్తారు. ఆ తర్వాత పన్నులు చెల్లించకుండా అలా వదిలేస్తారు. వారిలో ఎక్కువ మంది ఇతర ప్రాంతాలలో నివసిస్తుండటం వల్ల వారి ఆచూకీ దొరకక మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులు పడుతుంటారు. చేసేది లేక వాటికి వడ్డీలు వేస్తూ వస్తుంటారు.

ఏడు వేల మందికి లబ్ధి

తెనాలి పట్టణంలో ఇంటి పన్ను బకాయిలు ఉన్న వారు 5,269 మంది ఉన్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. వీరు కాకుండా ఖాళీ స్థల యజమానులు 2,595 మంది ఉన్నారు. వీరిలో సకాలంలో పన్నులు చెల్లించని వారు 1,685 మంది ఉన్నారు. వీరందరూ ఇప్పుడు ఇంటి, ఖాళీ స్థల పన్నులు అసలుతోపాటు వడ్డీని కలిపి చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని ప్రకటించింది. దీనివల్ల కేవలం పన్ను మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. వడ్డీ మాఫీ వల్ల సుమారుగా ఏడువేల మందికి రూ.8కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

31లోపు చెల్లించండి



పన్ను బకాయిదారులకు వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల మున్సిపాలిటీ పరిధిలోని సుమారు ఏడు వేల మందికి లబ్ధి చేకూరనుంది. ఇంటి, ఖాళీ స్థల యజమానులు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును ఉపయోగించుకోవాలి. మార్చి 31లోపు బకాయిలు చెల్లించాలి.

– ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

కేదారేశ్వరా.. ప్రణామం



ప్రత్యేక అలంకరణలో ఉన్న శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు

కర్లపాలెం మండలం అగ్రహారం గ్రామంలోని గంగాగౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శివపార్వతుల శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. కల్యాణోత్సవంలో భాగంగా శివాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచి పలు రకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం శివమారుతిశర్మ గాయత్రీ దంపతులచేత లోక కల్యాణం కోసం శాస్త్రోక్తంగా శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వాసుదేవ శాస్త్రి, సూర్య ప్రసాద్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

– కర్లపాలెం

నమో బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ మాఘ మాసం ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఉచిత శిక్షణకు నవోదయ విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో 12వ తరగతి చదివే విద్యార్థులకు నిర్వహించే ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ఎంపికవ్వడం హర్షణీయమని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ దక్షిణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నీట్ (మెడికల్) జేఈఈ (ఐఐటీ) కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. ఈ పరీక్షల్లో విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.

పఠనాసక్తి పెంపే ప్రాతిపదికగా

- మారిన 'పది' పరీక్ష తీరు
- రెండు పేపర్ల విధానం రద్దు
- 11 నుంచి 6 పేపర్లకు కుదింపు
- ఇంటర్నల్, బిట్ పేపర్ పద్ధతికి స్వస్తి
- ఒక్కో సబ్జెక్టుకు వంద మార్కులు
- గ్రేడ్ పాయింట్లు తొలగింపు
- పాత విధానంలో మార్కులు కేటాయింపు



పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

బాపట్ల అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధానంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొత్త విద్యా విధానానికి నాంది పలికింది. బాపట్ల జిల్లాలో 334 పాఠశాలల్లో సుమారు 1,734 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలను పాత పద్ధతిలో కాకుండా కొత్త విధానంలో నిర్వహించనున్నారు. బాపట్ల జిల్లా మొత్తం 103 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు రెగ్యులర్ 16,754 మంది, సప్లిమెంటరీ 590 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రభుత్వం చేపట్టిన నూతన పరీక్ష విధానంతో విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరనుంది. ఇంటర్నల్ మార్కులు, బిట్‌పేపర్ విధానాన్నీ తొలగించి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.

ఒకే పేపర్ విధానం

గతంలో పేపర్ 1, పేపర్ 2 పద్ధతిలో పరీక్షలు నిర్వహించేవారు. ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు రాయాల్సి వచ్చేది. రెండుసార్లు ఒకే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష రాయడానికి విద్యార్థులు పడుతున్న అవస్థలను గుర్తించిన ప్రభుత్వం మార్పునకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా ఇప్పుడు ఒక సబ్జెక్టుకు ఒక పేపర్‌నే వంద మార్కులకు ఇవ్వనున్నారు. ఆరు పేపర్లే 600 మార్కులకు ఉండనున్నాయి. ఈ పద్ధతి వల్ల విద్యార్థులపై ఉన్న అధిక భారం తగ్గి పఠనాసక్తి పెరగనుంది.

ఇంటర్నల్, బిట్ పేపర్ విధానానికి స్వస్తి

గతంలో ఇంటర్నల్, బిట్ పేపర్ విధానాలతో అదనపు మార్కులను జోడించేవారు. ప్రస్తుతం ఇంటర్నల్ మార్కులను పూర్తిగా తొలగించారు. అలాగే ప్రత్యేకంగా 30 మార్కులకు ఉన్న బిట్ పేపర్‌ను రద్దు చేశారు.

గ్రేడ్ పాయింట్లు తొలగింపు

గ్రేడ్ పాయింట్ల విధానానికి ప్రభుత్వం ముగింపు పలికింది. గ్రేడ్ పాయింట్ల వల్ల విద్యార్థులకు ఉన్నత చదువుల్లో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో గ్రేడ్ల ఆధారంగా సీట్ల కేటాయింపునకు అధికారులు అవస్థలు పడ్డారు.

పరీక్ష సమయం పెంపు

గతంలో ఉన్న పరీక్ష సమయాన్ని ప్రభుత్వం మార్పు చేసింది. ఈ సమయం గతంలో మూడు గంటలు ఉండేది. అయితే అదనంగా 15 నిమిషాల వ్యవధిని ఈ ఏడాది నుంచి పెంచారు. ఈ 15 నిమిషాల్లో రాసిన సమాధానాలను మరోసారి సరిచూసుకోవడానికి కేటాయిస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది.

ప్రశ్నాపత్రాలు ఇలా

- తెలుగులో పద్యభాగంలో ప్రతిపదార్థాలు, చిన్న ప్రశ్నలు, వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి.
- హిందీలో ఒక మార్కు పేరాగ్రాఫ్ ద్వారానే ప్రశ్నలు లేక వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి
- ఇంగ్లిషులో పేరాగ్రాఫ్ ప్రశ్నలు గ్రామర్ క్రియేటివిటీ రైటింగ్స్ ఉంటాయి
- సామాన్య శాస్త్రం మినహా అన్ని సబ్జెక్టులకు ఒకటే ప్రశ్నపత్రం ఉంటుంది
- సామాన్య శాస్త్రంలో భౌతిక రసాయన శాస్త్రాలు ఒక విభాగం జీవశాస్త్రం పేపర్లను పార్ట్–ఏ, పార్ట్–బీగా చేసి ఒక పార్ట్‌కు 50 మార్కుల చొప్పున ప్రశ్నపత్రాలు ఇవ్వనున్నారు.
- గణిత శాస్త్రంలో గ్రాఫులు, సైన్స్‌లో బొమ్మలు గీయడం, సోషల్‌లో రెండు మ్యాప్‌లు (ఇండియా, వరల్డ్) ఉండనున్నాయి.
- మొత్తంగా నాలుగు సెక్షన్లుగా 33 ప్రశ్నలకు 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది
- సెక్షన్ ఏలో ఒక మార్కు సూక్ష్మ లఘు ప్రశ్నలకు 12 మార్కులు కేటాయిస్తారు
- సెక్షన్ బీ లో రెండు మార్కుల తేలికైన ప్రశ్నలు 8 ఉంటాయి
- సెక్షన్ సీలో నాలుగు మార్కుల లఘు ప్రశ్నలు ఎనిమిది ఉంటాయి
- సెక్షన్ డీలో 8 మార్కుల వ్యాస రూప ప్రశ్నలు 5 ఉంటాయి.

పరీక్షల విధానం మారింది



బోధన ఆధారంగా పరీక్షల్లో ప్రభుత్వం మార్పులు చేపట్టింది. ఈ మార్పులతో విద్యార్థుల అభ్యసనా పద్ధతిలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. బిట్ పేపర్‌ను రద్దుచేసి విద్యార్థులకు అదనపు సమయాన్ని ఇవ్వడం హర్షణీయం. గ్రేడ్ల పద్ధతిని రద్దుచేసి మార్కులు కేటాయించడం వల్ల ర్యాంకులు తెలుసుకోవచ్చు. ఇంటర్నల్ మార్కుల రద్దుతో విద్యార్థులలో పఠనాసక్తిని పెంచవచ్చు.

– పి.వి.జె.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

సప్తగిరి సంకీర్తన

200 మందికిపైగా గానం



గానాలాపన

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవేంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 520వ ఆరాధనోత్సవం జరిగింది. తొలుత శ్రీవేంకటేశ్వరస్వామికి అర్చన చేసి, పాత్తూరి వెంకట ఆదిలక్ష్మి సంకీర్తనాగానం ప్రారంభించారు. తదుపరి కంకిపాటి పద్మావతి బృందం కోలాట ప్రదర్శన చేసింది. గౌరావఝుల ఆంజనేయశాస్త్రి సారథ్యంలో యల్లాప్రగడ జానకి, కొండపి వసుంధర, శివసుధీర్‌కుమార్, వఝుల లక్ష్మీసునీత, నేరెళ్ల కళ్యాణి, మూర్తి అనూరాధ, సొల్లేటి శైలజ, చుండూరు ఆదిలక్ష్మి బృందాల్లోని 200 మంది గాయకులచే సప్తగిరి సంకీర్తన నాలుగు గంటలపాటు నిర్వహించారు. తెనాలిలోని గురువులకు సంస్థ తరఫున సత్కారం చేశారు. డాక్టర్ కె.పురుషోత్తం, డాక్టర్ జీవనలత, వుప్పల వరదరాజులు, లక్కరాజు లక్ష్మణరావు, డాక్టర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ధ్యాన శిక్షణ



ధ్యానశిక్షణ నిస్తున్న గురువులు

తెనాలి: శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్నెస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా చేపట్టిన మూడురోజుల ధ్యాన శిక్షణ మహోత్సవం ఆదివారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజి మైదానంలో ప్రారంభమైంది. ఆజాదీ కా అమృతోత్సవ్ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటైన కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీరామచంద్ర మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్ ధ్యాన శిక్షణతోపాటు శారీరక స్వస్థత కోసం యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు మొదలైన వాటిలో శిక్షణనిస్తూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తోందని చెప్పారు. ఈ శిక్షణలో మూడురోజులు స్థానిక ప్రజలు హాజరై ప్రయోజనం పొందాలని కోరారు. తెనాలి కో–ఆర్డినేటర్ ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్‌కు తెనాలిలో గల మూడు ధ్యాన కేంద్రాల్లోనూ శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత తరగతుల అనంతరం ఆయా కేంద్రాల్లో శిక్షణ కొనసాగించవచ్చని తెలిపారు. తొలుత యోగా మాస్టర్ నాగేంద్ర ఆసనాలు, ప్రాణాయామంలో, ధ్యాన శిక్షకులు ఎంఆర్‌కే మూర్తి ధ్యాన్య శిక్షణలో తరగతులను నిర్వహించారు.

'ఉండ్రాళ్లయ్యా'.. దండాలయ్యా

లక్ష ఉండ్రాళ్ల నివేదన



భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధిబుద్ధి సమేత గణపతిస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామికి లక్ష ఉండ్రాళ్ల నివేదన శాస్త్రయుక్తంగా నిర్వహించారు. పంచాయతన ఆలయాలుగా ప్రసిద్ధి చెందిన గణపతి స్వామి, ఆది కామకామేశ్వరి, రామేశ్వరస్వామి, ఆదిశేషాచల స్వామి దేవస్థానాల్లో పంచామృత అభిషేకాలు జరిపారు. గణపతి స్వామికి 10 సార్లు రుద్రాభిషేకం చేశారు. ఉండ్రాళ్లను నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకులు క్రోవి వెంకట శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అర్చక బృందం పూజలు చేసింది. భక్తులకు స్వామికి నివేదించిన ఉండ్రాళ్లను వితరణ చేసింది. ఇదిలా ఉంటే గణపతి స్వామికి భట్టిప్రోలుకు చెందిన పెనుమర్తి వెంకట అనంత పద్మనాభ శర్మ–మీనాక్షి దంపతులు రూ.1.40 లక్షల విలువైన రెండు కిలోల వెండి కిరీటాలను అందజేశారు. ఆలయ అర్చకులు శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక పూజలు చేశారు.

– వెల్లటూరు(భట్టిప్రోలు)

వైభవంగా పోతురాజు స్వామి తిరునాళ్ల



పోతురాజు స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

చెరుకుపల్లి: మండలంలోని తూర్పుపాలెం పంచాయతీ ఆవలవారిపాలెంలోని మాలక్ష్మమ్మ నూకాలమ్మ పోతురాజు చల్లలమ్మ, పోతురాజు స్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ, డప్పు కళాకారుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పూషడపు పోతయ్య, లక్ష్మీగోవర్ధనమ్మ, గండే గోపాలరావు గౌతమీదేవి, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరిపై కేసు

- 71 మద్యం బాటిళ్లు, కారు స్వాధీనం
- ఏఈఎస్ నరశింహారావు



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కారు

బాపట్లటౌన్: అక్రమ మద్యం కేసులో ఎస్ఈబీ అధికారులు ఆదివారం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితుల వివరాలను ఎస్ఈబీ ఏఈఎస్ జి.నరశింహారావు ఆదివారం సెబ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామానికి చెందిన సూరే వెంకటేశ్వరరావు గ్రామంలో హోటల్ నిర్వహిస్తుంటాడు. హోటల్ ముసుగులో పుదుచ్చేరికి చెందిన మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నాడు. వెంకటేశ్వరరావు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న సెబ్ అధికారులు పక్కా ప్లాన్‌తో అదుపులోకి తీసుకున్నారు. వెంకటేశ్వరరావుకు మద్యం సరఫరా చేస్తున్న చెరుకుపల్లి మండలం రాంబోట్లపాలెం గ్రామానికి చెందిన జూపూడి బేబీశ్వరరావుపై కేసు నమోదుచేశారు. వీరి వద్ద నుంచి 71 మద్యం బాటిళ్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. మద్యం వ్యాపారం చేసినా, ఇతర రాష్ట్రాల్లోని బాటిళ్లను మన రాష్ట్రంలో విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఈబీ సీఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీల పట్టివేత

ఈపూరు: అధిక లోడు, సరైన పత్రాలు లేనందున గ్రానైట్ లోడుతో ఉన్న ఐదు లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మార్చూరు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న అధికలోడు, సరైన పత్రాలు లేని గ్రానైట్ లోడు లారీలను అంగలూరు వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.